సాక్షి తిరుపతి

ఆదివారం । 7 । జూలై । 2024



లక్ష్మిరెడ్డికి ఘన నివాళి

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తండ్రి లక్ష్మిరెడ్డికి ఘన నివాళి అర్పించారు. పలువురు అభిమానులు పాల్గొన్నారు. - 8లో



శ్రీవారి సేవలో..

తిరుమల శ్రీవారిని శనివారం హంపి మఠం విరుపాక్షి విద్యారణ్య మహాసంస్థానం పీఠాధిపతి దర్శించుకున్నారు. - 8లో



బంగారు తిరుచ్చిపై అనుగ్రహం

శ్రీనివాసమంగాపురంలో శ్రీరాముల వారు బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. - 8లో

న్యూస్‌రీల్

9న కేవీకే ఫలసాయ వేలం

వెంకటగిరి రూరల్: పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో సాగవుతున్న నిమ్మ, చీనీ, సపోట పంటలకు సంబంధించి ఈనెల 9వ తేదీన వేలం పాటలు నిర్వహించనున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బీ.గోవిందరాజులు తెలిపారు. నిమ్మ 230, చీనీ 140, సపోట 75 చెట్లు ఉన్నాయని, ఈ చెట్లకు సంబంధించి ఫలసాయంపై మంగళవారం ఉదయం 10.30 గంటలకు వేలం పాటలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 89854 61284 నంబర్‌లో సంప్రదించి, వివరాలను తెలుసుకోవాలని ఆయన సూచించారు.

సకాలంలో వారెంట్లు జారీ చేయాలి



మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్: సకాలంలో సమన్లు, వారంట్లను జారీ చేయాలని ఎస్పీ హర్షవర్ధన్ రాజు కోర్టు కానిస్టేబుళ్లను ఆదేశించారు. శనివారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా పరిధిలోని కోర్టు కానిస్టేబుళ్లతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో వారి పనితీరును అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక సమస్యల గురించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. భారత ప్రభుత్వం నూతనంగా అమలులోకి తెచ్చిన చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని కోరారు. ఈ చట్టాల మేరకే తమ విధులను నిర్వహించాలని కోర్టు కానిస్టేబుళ్లను ఆదేశించారు. నేరం చేస్తే శిక్ష తప్పదు అనే సందేశాన్ని సమాజానికి ఇచ్చినప్పుడే పోలీసుల పనితీరుపై ప్రజల్లో నమ్మకం ఏర్పడుతుందన్నారు. సమీక్షలో ఏఎస్పీలు, డీఎస్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

9న జాబ్ మేళా

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలోని ఉప ఉపాధి కార్యాలయంలో ఈ నెల 9వ తేదీ ఉదయం 10గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జూనియర్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ ఎస్.వెంకటరమణ తెలిపారు. ఈ జాబ్ మేళాలో వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొని ఆయా సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా అపోలో ఫార్మసీ రీటైల్ ట్రైనీ అసోసియేట్, ఫార్మాసిస్ట్ ఉద్యోగాలకు పది, ఇంటర్, డిప్లొమో, డిగ్రీ, బీఫార్మసీ, ఎంఫార్మసీ విద్యార్హత, శ్రీజ మిల్క్ సంస్థలో ఫీల్డ్ కెమిస్ట్ ఉద్యోగాలకు గ్రాడ్యుయేట్ ఇన్ సైన్స్, డిప్లొమో(కెమిస్ట్/మైక్రోబయాలజీ), బీటెక్(డెయిరీ టెక్) విద్యార్హత, బిగబాస్కెట్ సంస్థలో స్కానర్, పికర్, ప్యాకెట్ ఉద్యోగాలకు పది, ఇంటర్, డిగ్రీ విద్యార్హత, అమరరాజ సంస్థలో టెక్నీషియన్ ఉద్యోగాలకు పది, ఇంటర్, ఐటీఐ విద్యార్హత, రాన్‌స్టాండ్ సంస్థలో టెక్నీషియన్/హెల్పర్ ఉద్యోగాలకు పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ విద్యార్హత కలిగి ఉండాలని, అలాగే ఆయా సంస్థల్లో ఉద్యోగాలకు 18 నుంచి 30 ఏళ్లలోపు వయసు కలిగిన స్త్రీ, పురుషులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు పూర్తి బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లతో జాబ్ మేళాకు హాజరవ్వాలని తెలిపారు. ఇతర వివరాలకు 81210 15844, 89194 65770 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

శునకాలకు ఉచిత రోగ నిరోధక టీకాలు



శునకానికి టీకా వేస్తున్న కళాశాల అసోసియేట్ డీన్ జగపతిరామయ్య

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పశువైద్య కళాశాల ఆధ్వర్యంలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని శనివారం వర్సిటీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 456 శునకాలకు, పిల్లులకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కళాశాల అసోసియేట్ డీన్ పీ.జగపతిరామయ్య, ఫ్యాకల్టీ ఆఫ్ వెటర్నరీ సైన్స్ డీన్ డాక్టర్ కే.వీరబ్రహ్మయ్య పాల్గొన్నారు. వర్సిటీలోని పశువైద్య చికిత్సాలయంతో పాటు నగరంలోని తాతయ్యగుంట పశువైద్యశాలలో సైతం యాంటీ రెబీస్ టీకాలు వేసినట్లు పశువైద్య చికిత్స విభాగాధిపతి డాక్టర్ వైకుంఠరావు తెలిపారు. నగరంలో పెంపుడు జంతువులను పెంచుకుంటున్న ప్రజలు టీకాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వర్సిటీ డీన్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అవినీతి కేంద్రాలుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే దందా
- ఉన్నత స్థాయి అధికారులకు వాటాలు
- రిజిస్ట్రేషన్ ప్రక్రియలో మార్పులపై నోరుమెదపని కూటమి ప్రభుత్వం
- అవినీతినిర్మూలనకు గత ప్రభుత్వ హయాంలో సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు

జూలు విదిల్చిన అవినీతి!



రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఇటీవల రమేష్ అనే వ్యక్తి (పేరు మార్చాం) తన వ్యవసాయ భూమిని విక్రయించడానికి వెళ్లాడు. భూమికి సంబంధించిన ఒక సర్వే నంబరులో వచ్చే స్థలాన్ని వ్యవసాయ భూమిగా విక్రయించడానికి వీల్లేదని, ఇంటి జాగా కింద రిజిష్టరు చేయాలని తిప్పి పంపేశారు. అలా చేస్తే రిజిస్ట్రేషన్ ఫీజు ఎక్కువ అవుతుండడంతో డాక్యుమెంట్ రైటర్ ద్వారా రమేష్ సబ్‌రిజిస్ట్రార్‌ను సంప్రదించారు. రిజిస్ట్రార్‌తో సంప్రదింపులు జరిపిన రైటర్ రూ.30 వేలకు బేరం కుదుర్చుకుని చడీచప్పుడు లేకుండా రిజిస్ట్రేషన్ చేసేశారు.

గూడూరులోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో చోటుచేసుకుంటున్న అవినీతిపై గతంలో ఏసీబీ అధికారులకు అనేక ఫిర్యాదులు వెళ్లాయి. అప్పట్లో ఏసీబీ దాడులు నిర్వహించి అవినీతికి పాల్పడ్డ వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. అయినా అక్కడ మార్పు రావడం లేదు. ఏ రిజిస్ట్రేషన్ జరగాలన్నా ఒక డాక్యుమెంట్ రైటర్ ఆమోదముద్ర వేస్తేనే సబ్‌రిజిస్ట్రార్ సంతకం చేసే పరిస్థితి కనబడుతోంది. ఇక్కడ కోదండం అనే వ్యక్తి వ్యవసాయ భూమి అమ్మడానికి వెళ్లగా ఆధార్ కార్డులోని పేరుకు, 1–బీ పట్టాలోని పేరుకు ఒక అక్షరం తేడా వచ్చింది. దీంతో రిజిస్ట్రేషన్ చేసేది లేదని రిజిస్ట్రార్ తిప్పిపంపేశాడు. ఆపై డాక్యుమెంట్ రైటర్ తనదైన శైలిలో మంతనాలు జరిపారు. మొత్తంగా రూ.10 వేలు లంచం ఇవ్వడంతో రిజిస్ట్రేషన్ సజావుగా జరిగిపోయింది.

.. ఇది ఒక గూడూరు, రేణిగుంటలోనే కాదండోయ్.. ఉమ్మడి జిల్లాలో ఏ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లినా ఇదే పరిస్థితి. ఒక్కో తప్పుకు ఒక్కో రేటు విధిస్తున్నారు. డాక్యుమెంట్ రైటర్లను అడ్డం పెట్టుకుని అడ్డదిడ్డంగా వసూలు చేస్తున్నారు. ఈ అవినీతి సామ్రాజ్యానికి ముకుతాడు వేసేందుకు గత ప్రభుత్వం సచివాలయంలోనే భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టగా.. ఇప్పుడొచ్చిన కూటమి ప్రభుత్వం దీనిపై నోరు మెదపడం లేదు. ఇదే అదునుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది తమ అవినీతి జూలు విదిల్చి విచ్చలవిడిగా దండుకుంటుండడం విమర్శలకు తావిస్తోంది.

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఉమ్మడి జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోతున్నాయి. ఇక్కడి సిబ్బంది చేతులు తడపందే రిజిస్ట్రేషన్లు కావడం లేదు. దీంతో క్రయవిక్రయదారులు సిబ్బంది అడిగినంత సమర్పించుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. చిత్తూరు జిల్లాలో 8 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, తిరుపతి జిల్లాలో 16 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కొంతమంది అవినీతి సబ్‌రిజిస్ట్రార్లు, డాక్యుమెంట్ రైటర్లు, ఒప్పంద సిబ్బంది భాగస్వాములై తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు కార్యాలయాలకు వచ్చే వారిని దోచేస్తున్నారు. దీంతో ఆస్తుల రిజిస్ట్రేషన్ అంటేనే జనం జడుసుకుంటున్నారు.

ఒక్కో పొరపాటుకు ఒక రేటు

ప్రతి రిజిస్ట్రేషన్‌కు, రికార్డుల్లో కనిపించే ప్రతి పొరపాటుకు రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది ఓ రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నారు. ఆస్తుల విక్రయాలకు వచ్చేవారి పేరు పట్టా పాసుపుస్తకానికి, ఆధార్ కార్డుకు కచ్చితంగా సరిపోవాల్సిందే. లేకుంటే అక్షరం మారినా కప్పం కట్టాల్సిందే. 1–బీలో ఇంటిపేరు పూర్తిగా రాసి, ఆధార్‌లో ఇన్షియల్ వేసి ఉన్నా, ఆధార్‌లో పేరు పక్కన కులం పేరు ఉండి 1–బీలో లేకున్నా, తండ్రి పేరుకు ఇన్షియల్ లేకున్నా వారు బలైపోయినట్టే. ఇలాంటి వారికి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది ఒక్కో రేటు విధించి వసూలు చేస్తున్నారు. కార్యాలయాల్లో వసూళ్లంతా డాక్యుమెంట్ రైటర్లు, ఒప్పంద సిబ్బంది కనుసన్నల్లోనే సాగిపోతోంది. ఇక్కడ చోటుచేసుకునే అవినీతిపై ఎవరైనా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకునే వారు లేకపోగా ఆ ఫిర్యాదులను ఆధారంగా చేసుకుని నెలవారీగా అందించే సొమ్ముకు అదనంగా వసూళ్లు చేసుకోవడం ఉన్నతాధికారుల వంతైపోయిందన్న విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో లంచం ఇవ్వందే ఏ పనీ జరగడంలేదనే అపవాదు సర్వత్రా వినిపిస్తోంది.

ఇబ్బంది పెడుతున్న ఎల్‌పీఎం జాప్యం

రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు వచ్చేవారిని ఒకవైపు రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది వేధిస్తుంటే మరోవైపు ఎల్‌పీఎం జాప్యం ఇబ్బంది పెడుతోంది. రీ సర్వే ప్రక్రియ జిల్లాలోని పలు గ్రామాల్లో పూర్తికాకపోవడం, కొన్ని గ్రామాల్లో అరకొర పూర్తి కావడంతో వాటికి ల్యాండ్ పార్సిల్ నంబర్ (ఎల్‌పీఎం)లు అందించలేదు. దీంతో ఆ గ్రామాలకు సంబంధిత రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అంతరాయం ఏర్పడుతోంది. సమగ్ర భూసర్వే పూర్తయిన గ్రామాల్లో భూముల వివరాలను రెవెన్యూశాఖ వెబ్‌ల్యాండ్‌లో అప్‌లోడ్ చేసింది. వాటిని రిజిస్ట్రేషన్ శాఖ మ్యాపింగ్ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తయితేనే రిజిస్ట్రేషన్‌కు వీలుంటుంది. అయితే ఈ ప్రక్రియ కొన్నిచోట్ల ఇప్పటికీ పూర్తికాకపోవడంతో ఆ గ్రామాల్లో ఎల్‌పీఎం నంబర్ అప్రూవల్‌గాక వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ నిలిచిపోయాయి. కొత్త ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ఇంకా ఎలాంటి నిర్ణయాన్ని ప్రకటించకపోవడం రైతులకు శాపంగా మారుతోంది. సాఫ్ట్‌వేర్‌లో మార్పులు, చేర్పులు ఉంటాయా? లేక గత ప్రభుత్వ విధానాన్నే కొనసాగిస్తుందా? అన్నది తేలాల్సి ఉంది. కాగా సమగ్ర భూ సర్వే పట్ల చాలా చోట్ల అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో భూసర్వే పూర్తయి ఎల్‌పీఎం నంబర్ అప్రూవల్ కాకుండా పెండింగ్‌లో ఉన్న గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విడుదల కావాల్సి ఉంది.

డయేరియాను తరిమికొడదాం రండి!



సమీక్షిస్తున్న డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి

వరదయ్యపాళెం: అందరి సమన్వయంతో డయేరియాను దూరం చేద్దామని డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి పిలుపునిచ్చారు. శనివారం ఆమె వరదయ్యపాళెంలోని వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో సీసీలు, సంఘమిత్రాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అలాగే తిరుపతి జిల్లాలోని పలు మండలాల వైఎస్సార్ క్రాంతి పథకం సిబ్బందితో ఆమె వర్చువల్‌గా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జూలై, ఆగస్టు మాసాల్లో ఆరోగ్య సిబ్బందితో ప్రతిఒక్కరూ సమన్వయం చేసుకుని పారిశుద్ధ్యం, ఇతర ఆరోగ్య భద్రతా చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతిఒక్కరూ చేతులు శుభ్రం చేసుకునే విధంగా గ్రామసమాఖ్య వారు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి, ఇంటి వద్ద ఉన్న ట్యాంకులు, నీటిని నిల్వ చేసే తొట్టిలను శుభ్రం చేయాలని చెప్పారు. వైఎస్సార్ క్రాంతి పథకం ద్వారా పంపిణీ చేసిన రుణాలకు సంబంధించి రికవరీలను సకాలంలో చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏరియా కో–ఆర్డినేటర్ వెంకటేష్, ఏపీఎం సీతారాం తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 65,775 మంది స్వామివారిని దర్శించుకోగా, 25,126 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.41 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- ఎంపీ నిధులతో నియోజకవర్గంలో రూ.4.5 కోట్లతో అభివృద్ధి పనులు
- ఆలత్తూరులో బస్‌షెల్టరు నిర్మాణం
- టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన విజయ, చంద్రికలను పరామర్శించిన తిరుపతి ఎంపీ గురుమూర్తి



మండల పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి



గాయపడిన విజయ, చంద్రికను పరామర్శిస్తున్న ఎంపీ గురుమూర్తి, సత్యవేడు సమన్వయకర్త రాజేష్

బుచ్చినాయుడుకండ్రిగ: 'రాజకీయాల్లో గెలుపోటములు సహజం. కార్యకర్తలు, నాయకులు అధైర్య పడొద్దు. అండగా నిలబడతాం'అని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటిరాజేష్ స్పష్టం చేశారు. శనివారం వారు టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన ఆలత్తూరు దళితవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు చెంచమ్మ కుమార్తెలు విజయ, చంద్రికను పరామర్శించారు. ఈ విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీఇచ్చారు. అనంతరం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, ఎన్నికల్లో ఆదరించి కష్టపడి పనిచేసిన నాయకులకు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలందరికీ శిరస్సు వంచి కృతజ్ఞతాభినందనాలు తెలుపుతున్నామన్నారు. పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తామని చెప్పారు. నిత్యం ప్రజల్లో ఉంటూ కేడర్‌ను కాపాడుకుంటామన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చాక టీడీపీ శ్రేణుల దాడులతో రాష్ట్రంలో అత్యంత భయానక పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి పార్లమెంట్ పరిధిలోనే సత్యవేడు నియోజకవర్గంలో ఎంపీ నిధులు రూ.4.50 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్టు వెల్లడించారు. ప్రజల వెంట అనునిత్యం ఉండి వారి సమస్యలపై శాంతియుత పోరాటాలకైనా సిద్ధమని చెప్పారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త, నాయకులు తిరుపతి ఎంపీ సభ్యులేనని తెలిపారు. అనంతరం నూకతోటిరాజేష్ మాట్లాడుతూ ఎన్నికలకు 60 రోజుల ముందు తనను సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్తగా పార్టీ అధిష్టానం నియమించిందని, అతి తక్కువ రోజుల్లో ప్రజలు, పార్టీ శ్రేణులు గొప్పగా ఆదరించారని కొనియాడారు. స్వల్ప తేడాతో ఓటమి చెందానని, అయినా ప్రజల తీర్పును శిరసావహించి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. సత్యవేడు నియోజకవర్గ జేసీఎస్ కన్వీనరు వేలూరు రాకేష్, భానుప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ మేకల సుబ్బరత్నమ్మ, వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శులు జొన్నలగోపాల్‌రెడ్డి, రవిరెడ్డి, మణినాయుడు, గురునాథ, సాయినాయుడు, నాయకులు గెడితోట్టిగురవయ్య, అజయ్‌కుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, జయచంద్రనాయుడు, కోటీశ్వరరావు, సముద్రాల అశోక్, ధర్మయ్య, వెంకటాద్రి, ప్రసాద్‌పాల్, సంజీవి, ప్రసాద్, చంద్రారెడ్డి, కిరణ్, వేంకటేష్ పాల్గొన్నారు.

తూతూమంత్రంగా డ్యూటీలు చేయొద్దు



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్



కలెక్టరేట్‌లో పలు విభాగాలను పరిశీలిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: 'తిరుపతి ఓ జిల్లాకు కేంద్రం. ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం అందరికీ ఆదర్శంగా ఉండాలి. ఇక్కడి ఉద్యోగులు జవాబుదారితనంతో పనిచేయాలి. అర్జీదారులకు సంతృప్తికరమైన సమాధానం చెప్పాలి. ప్రతి రికార్డు పక్కాగా ఉంచుకోవాలి. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి. బాధ్యతగా డ్యూటీలు చేయాలి. అవినీతికి దూరంగా ఉండాలి. ఐక్యతతో ఉండాలి. తూతూ మంత్రంగా డ్యూటీలు చేస్తే కుదరదు' అంటూ కలెక్టర్ తిరుపతి అర్బన్ తహసీల్దార్ సిబ్బందిని హెచ్చరించారు. శనివారం ఆయన తిరుపతి అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గతంలో స్పందనకు, ప్రస్తుతం గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీలకు పరిష్కారం చూపించారా..? అంటూ ప్రశ్నించారు. ర్యాండమ్‌గా ఓ అర్జీని తీసుకున్నారు. రేణిగుంట మండలంలోని కరకంబాడి గ్రామానికి చెందిన మోనికా అనే ఆమె ఇంటి పట్టా కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఆమెకు ఇంటిపట్టాను అందించారా..? అని ప్రశ్నించారు. వెంటనే మంగళం వీఆర్వో జీవనజ్యోతికి నేరుగా కలెక్టర్ ఫోన్ చేశారు. ఎందుకు ఆమె అర్జీ పెండింగ్‌లోనే ఉందని అడిగారు. కరకంబాడి రేణిగుంట మండలం నేపథ్యంలో అక్కడి తహసీల్దార్‌కు ఎందుకు అర్జీని పంపలేదన్నారు. ఎక్కడి అర్జీలు అక్కడికి పరిష్కారం కోసం పంపించాలని సూచించారు.నిర్లక్ష్యంగా వ్యవహరించినా.. అర్జీదారులకు సరైన సమాధానం ఇవ్వకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ నారాయణరెడ్డి ఉద్యోగుల కొరత విషయాన్ని ప్రస్తావించగా.. ఎన్ని ఖాళీలున్నాయో నివేదిక పంపాలని చెప్పారు. మరో రెండు నెలల్లో తర్వాత తహసీల్దార్ కార్యాలయానికి వస్తానని.. జిల్లా కార్యాలయాలకు తిరుపతి మార్గదర్శంగా ఉండాలని సూచించారు. డెప్యూటీ తహసీల్దార్ అశోక్‌రెడ్డి, అడిషనల్ తహసీల్దార్ శ్యామ్, ఆర్‌ఐలు రామచంద్ర, జానీబాషా పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో తనిఖీలు

అనంతరం కలెక్టరేట్‌లోని పలు విభాగాలను కలెక్టర్ తనిఖీ చేశారు. సిబ్బందిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రికార్డుల విషయంలో క్రమపద్ధతిలో ఉంచుకోవాలని సూచించారు. నిత్యం ఉద్యోగులు అందుబాటులో ఉండాలని చెప్పారు. ఆయనతోపాటు డీఆర్వో పెంచలకిషోర్ తదితరులు ఉన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి



తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నాయకులు

నాయుడుపేట టౌన్: నెల్లూరు, తిరుపతి ఉమ్మడి జిల్లాల క్రీడాకారులు తైక్వాండో క్రీడా పోటీల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యాదర్శి సీహెచ్ వేణుగోపాల్ పిలుపునిచ్చారు. నాయుడుపేట పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న షాదీమంజిల్‌లో తైక్వాండో ఉమ్మడి జిల్లా స్థాయి రేఫరీలకు శనివారం శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నెల్లూరు జిల్లా– 2024 టైక్వాండో 8వ చాంపియన్ షిప్ పోటీలను నాయుడుపేటలో ఆదివారం ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఈ పోటీలు రెండు రోజుల పాటు సాగుతాయన్నారు. తైక్వాండో మినీ సబ్ జూనియర్, క్యాడెట్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలుంటాయని తెలిపారు. ఉమ్మడి జిల్లాల నుంచి 200 మందికి పైగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. అన్ని విభాగాల్లో బంగారు పతాకాలు సాధించిన క్రీడకారులు అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతారని చెప్పారు. అసోసియేషన్ జిల్లా కోశాధికారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉయ్యాల పవన్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి జీ.శ్రీనివాసులు, పలువురు కోచ్‌ల సారథ్యంలో పోటీలను నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

సన్మార్గంలో నడవడమే దేవుని ఆజ్ఞ



ప్రవచనం చేస్తున్న చాగంటి కోటేశ్వరరావు

నాయుడుపేటటౌన్: మనిషి చెడు మార్గాల్ని వదలి సన్మార్గంలో నడవడమే దేవుని ఆజ్ఞగా భావించాలని ప్రవచన చక్రవర్తి బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు వివరించారు. నాయుడుపేట కేఎంఆర్ కన్వెక్షన్ సెంటర్ వద్ద శనివారం రాత్రి ఆయన నిత్య పూజా విధానాలు, ఆధాత్మికత పై ప్రవచనాలను వివరించారు. ఆదివారం కూడా ప్రవచనాల కార్యక్రమం ఉంటుందన్నారు. అంతకుముందు కేఎంఆర్ కన్వెక్షన్ సెంటర్ అధినేత కలికి మాధవరెడ్డి, స్థానిక పారిశ్రామిక వేత్త పెసల జయరాజగోపాల్ కుటుంబ సభ్యులు, నాయుడుపేట చాగంటి సత్సంగ కమిటీ సభ్యులు చాగంటి కోటేశ్వరరావును ఘనంగా సత్కరించారు.

నేడు యూపీఎస్సీ పరీక్షలు



యూపీఎస్సీ పరీక్షల నిర్వహణపై సూచనలు చేస్తున్న డీఆర్వో పెంచల కిషోర్

తిరుపతి అర్బన్: యూపీఎస్సీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లో తిరుపతి ఆర్డీఓ నిషాంత్‌రెడ్డితో కలిసి పరీక్షల నిర్వాహకులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యూపీఎస్సీ (ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐసీ) పరీక్షలు ఆదివారం తిరుపతి నగరంలోని పది సెంటర్లలో నిర్వహించనున్నట్టు తెలిపారు. మొత్తం 5,273 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నట్టు వెల్లడించారు. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు మూడు సెంటర్లలో ఈపీఎఫ్‌వోకు చెందిన పర్సనల్ అసిస్టెంట్ ఉద్యోగాలకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు ఈఎస్‌ఐసీకు చెందిన నర్సింగ్ ఆఫీసర్ల పోస్టులకు 7 సెంటర్లలో పరీక్షలు ఉంటాయని తెలిపారు. ఒక్కో సెంటర్‌కు ఒక తహసీల్దార్ చొప్పున 10 మంది తహసీల్దార్లను లైజన్ అధికారులుగా, ఆరుగురు జిల్లా అధికారులను సహాయ సమన్వయ అధికారులుగా నియమించినట్టు చెప్పారు. తిరుపతి ఆర్డీవో నిషాంత్‌రెడ్డి పరీక్ష పేపర్ల కస్టోడియన్‌గా వ్యవహరిస్తారని తెలిపారు.

ముక్కంటి ఆలయంలో బదిలీలు

రేణిగుంట: శ్రీకాళహస్తీశ్వరాలయంలో భారీగా అంతర్గత బదిలీలు జరిగాయి. ఈ మేరకు ఈఓ ఎస్వీఎస్ఎస్ మూర్తి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అవుట్‌సోర్సింగ్‌కు సంబంధించి 9 మంది, రెగ్యులర్ ఉద్యోగులు 33 మంది, కాంట్రాక్టు ఉద్యోగులు 36 మందిని బదిలీ చేసినట్లు ఆయన ప్రకటించారు. బొజ్జల సుధీర్‌రెడ్డి ఎమ్మెల్యే అయిన వెంటనే గత ఈఓ నాగేశ్వరరావు అవుట్‌సోర్సింగ్‌లో ఒకరు, ఏఈఓ స్థాయి అధికారిని ఒకరిని బదిలీ చేశారు. తరువాత భారీ కసరత్తు చేసి అన్ని శాఖలకు సంబంధించి 70 మందికి పైగా ఉద్యోగులను బదిలీ చేశారు. ఇంతమందిని ఒకేసారి అంతర్గ బదిలీచేయడం ఇదే ప్రథమం. దీనిపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

క్లుప్తంగా

పురుగుల బియ్యంపై కార్డుదారుల ఆగ్రహం



రేషన్‌బియ్యంలో ఉన్న పురుగులు

సత్యవేడు: పంచాయతీ పరిధిలోని గాంధీ రోడ్డులో గల 11వ నంబరు రేషన్ షాపులో రంగు మారి, పురుగులు పట్టిన బియ్యాన్ని కార్డుదారులు తీసుకునేందుకు నిరాకరించారు. శనివారం రేషన్ షాపులో బియ్యం పంపిణీ చేశారు. పురుగులు పట్టిన నాశిరకం బియ్యాన్ని చూసి కార్డుదారులు అవాక్కయ్యారు. నాశిరకం బియ్యం పంపిణీపై 'సాక్షి' తహసీల్దార్ రామాంజనేయులు దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే రేషన్ షాపును తనిఖీ చేశారు. రంగుమారిన పాత స్టాకు బియ్యాన్నిను గోడౌన్‌కు తరలించి, నాణ్యమైన బియ్యాన్ని రేషన్ షాపునకు పంపిణీ చేశారు.

లారీ క్లీనర్ మృతి

తడ: డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీని నడపడంతో తనతోపాటు విధులకు వచ్చిన క్లీనర్ శనివారం దుర్మరణం పాలయ్యాడు. ఎస్‌ఐ నరశింహారావు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా, గుడిపాల మండలం, రామాపురం గ్రామానికి చెందిన కనకం జయచంద్ర(44) అదే గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ వేలూరు నాగరాజులుతో కలిసి క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో నాయుడుపేట వద్ద ఉన్న మేనకూరు సెజ్‌లోని ఓ పరిశ్రమ నుంచి ట్రాన్స్‌ఫార్మర్ తీసుకుని చెన్నై పోర్టుకు బయలు దేరారు. తెల్లవారు జామున తడ మండలం, పూడి గ్రామం వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న హోటల్‌లో టీ తాగిన అనంతరం జయచంద్ర లారీ చక్రాల్లో గాలిని పరిశీలిస్తున్నాడు. అదే సమయంలో డ్రైవర్ నాగరాజులు లారీని కదిలించడంతో లారీ చక్రాలు జయచంద్ర కాళ్లపై ఎక్కాయి. దీంతో తీవ్ర రక్తస్రావం కావడంతో జయచంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మృతుని భార్య ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. ఆపై తడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

శ్రీవారిని దర్శించుకున్న హంపి మఠం పీఠాధిపతి



పీఠాధిపతికి స్వాగతం పలుకుతున్న జెఈఓ వీరబ్రహ్మం

తిరుమల: తిరుమల శ్రీవారిని శనివారం హంపి మఠం విరుపాక్షి విద్యారణ్య మహాసంస్థానం పీఠాధిపతి జగద్గురు విద్యారణ్య భారతి స్వామీజీ దర్శించుకున్నారు. తిరుమల బేడి ఆంజనేయస్వామి వద్దకు చేరుకున్న ఆయనకు టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఉపాధి నిధులు గోల్‌మాల్

- సామాజిక తనిఖీల్లో బహిర్గతం
- సస్పెన్షన్‌కు గురైన టీఏ, కురింజల్లం ఫీల్డ్ అసిస్టెంట్
- అక్రమాలపై రూ.1.3 లక్షల రికవరీకి అధికారుల ఆదేశం



కురింజల్లం ఫీల్డ్ అసిస్టెంట్‌ను విచారిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్

వరదయ్యపాళెం: జరిగిన పనులకు.. నమోదు చేసిన లెక్కలకు.. పొంతన లేని సమాధానాలతో ఉపాధి పనులు అంతా కనికట్టుగా మారాయి. ఈ విషయం సామాజిక తనిఖీ బహిరంగ సభలో ఒక్కొక్కటిగా బహిర్గతమైన ఘటన వరదయ్యపాళెం మండలంలో చోటుచేసుకుంది. 2023–24 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి శనివారం వరదయ్యపాళెం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో సామాజిక తనిఖీ, ప్రజావేదిక బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడాది కాలంలో 29 గ్రామ పంచాయతీల్లో రూ.8.08కోట్ల వ్యయంతో చేపట్టిన 675 పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక బహిరంగ సభలో చర్చించారు. ఈ సందర్భంగా పలు పంచాయతీల్లో చేపట్టిన పనులకు, ప్రస్తుతమున్న పరిస్థితులకు పూర్తిగా తేడాలు రావడంతో సంబంధిత పనులకు సంబంధించి రికవరీ చేపట్టమని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ ఆదేశించారు. ఈ సందర్భంగా జాతీయ ఉపాధి గ్రామీణ హామీ పథకంలో రూ.37,099 రికవరీకి ఆదేశించగా రూ.93,500 జరిమానా విధించినట్లు ఏపీఓ పేర్కొన్నారు. అలాగే కురింజల్లం పంచాయతీలో చేపట్టిన పనుల్లో జరిగిన అవకతవకలకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్ ఎం.లతను సస్పెండ్ చేస్తూ పీడీ ఆదేశాలు జారీచేశారు. పేదల కోసం జరిగే ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే సస్పెండ్లు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మన్ రాసరాయ నాయుడు, ఏపీడీ ప్రేమ్‌కుమార్, ఎస్ఆర్‌పీ రవి, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ గణేష్, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొంచ్చి శేషగిరి మోసగాడు

- మఠం భూములను కొని మోసపోవద్దు
- శేషగిరిపై చట్టప్రకారం చర్యలు
- హాథీరాంజీమఠం పరిపాలనాధికారి రమేష్‌నాయుడు
- మఠంలో అక్రమ నిర్మాణాలు కూల్చివేత



గాంధీపురంలో మఠం భూముల్లో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న సిబ్బంది

తిరుపతి రూరల్: హాథీరాంజీ మఠం భూములను అక్రమ లేఅవుట్ల ద్వారా రిజిస్ట్రేషన్లు సైతం లేకుండా స్టాంపు పేపర్ల ద్వారా అమ్ముతున్న మోసగాడు కొంచ్చి శేషగిరిరావు అని మఠం పరిపాలనాధికారి రమేష్‌నాయుడు తెలిపారు. గాంధీపురం పంచాయతీలోని మఠం భూముల్లో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను శనివారం రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో కూల్చివేశారు. ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవిలాల లెక్కదాఖల గాంధీపురం పంచాయతీ పరిధిలోని సర్వే నం.13,15, 17/2, 17/3, 17/5లో మొత్తం 174.75 ఎకరాల మఠం భూమి ఉందన్నారు. ఇందులో కొంచ్చి శేషగిరి అనే భూకబ్జారాయుడు తనకు ఎలాంటి హక్కులేకపోయినా అక్రమ లేఅవుట్ల ద్వారా భూములను అమ్మేస్తున్నట్లు గుర్తించామన్నారు. తిరుమల వెంకన్న సేవ కోసం ఏర్పాటైన మఠం భూములను ఇష్టారాజ్యంగా అమ్మేస్తున్న శేషగిరిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలను మోసం చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. స్టాంప్ పేపర్ల మీద మఠం భూములను విక్రయిస్తున్న ల్యాండ్ మాఫియా మాటలను నమ్మి మోసపోవద్దని ఆయన ప్రజలను కోరారు.

సిబ్బంది, జేసీబీ డ్రైవర్‌పై దాడి

ఆక్రమణలను తొలగించేందుకు వెళ్లిన మఠం సిబ్బంది, జేసీబీ డ్రైవర్‌పై కబ్జారాయుళ్లు దాడి చేశారు. కర్రలతో కొట్టారు. దీంతో డయల్ 100కు సిబ్బంది ఫిర్యాదు చేశారు. తిరుపతి రూరల్ పోలీసులు వచ్చి సిబ్బందిని రక్షించారు. దాడి చేసిన వారిపై మఠం సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పెద్దిరెడ్డి లక్ష్మురెడ్డికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు

సదుం: మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తండ్రి లక్ష్మురెడ్డి 12వ వర్ధంతిని శనివారం మండలంలోని ఎర్రాతివారిపల్లెలో నిర్వహించారు. ఆయన సమాధి వద్ద ప్రత్యేక పూజలు చేసి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, స్వర్ణలతమ్మ దంపతులు నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి దంపతులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, అభినయ్ రెడ్డి, రేణుకమ్మ, వేణుగోపాల్ రెడ్డి, నిహాంత్‌రెడ్డి నివాళులు అర్పించారు. పలువురు అభిమానులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటి వద్ద అన్నదానం చేశారు.

సమస్యలు పరిష్కరిస్తాం

పలువురు తమ సమస్యలపై ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని కలిశారు. సమస్యలను ఆలకించిన వారు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎమ్మార్సీ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, కొండవీటి నాగభూషణం, పుంగనూరు, పులిచెర్ల ఎంపీపీలు భాస్కర్‌రెడ్డి, సురేంద్రనాథరెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, నాయకులు ఫక్రుద్దీన్, కృష్ణారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, తిమ్మారెడ్డి, భాస్కర్ రెడ్డి, రామాంజులు, మోహన్‌రెడ్డి, గౌరీరెడ్డి, హరినాథరెడ్డి, గణేష్ రెడ్డి, నారాయణరెడ్డి, సయ్యద్‌బాషా, ఖాజాపీర్, ఇందాద్, వినోద్, శివారెడ్డి, మనోహర్ రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, ధనశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎస్వీయూ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విభాగం 1984–86 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పరిపాలన భవనంలో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 38 సంవత్సరాల తర్వాత 17 మందికి పైగా పూర్వ విద్యార్థులు అందరూ కలసి సమావేశం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఎస్వీయూలో చదవడం గర్వంగా ఉందని, వర్సిటీ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. వచ్చే ఏడాది ఆత్మీయ సమావేశానికి సంబంధించి ప్రణాళికను సిద్ధం చేసుకున్నట్లు తెలియజేశారు. వర్సిటీలో అధ్యాపకులు అందించిన సహకారం మరువలేనిదని గుర్తు చేసుకున్నారు. విద్యార్థి దశలో తమ అనుభవాలను చర్చించుకున్నారు. అనంతరం ముఖ్యఅతిథులుగా విచ్చేసిన అకడమిక్ డీన్ అప్పారావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ చంద్రయ్య చేతుల మీదుగా పూర్వ విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు.

9న కండలేరులో పూడికతీతకు టెండర్లు

తిరుపతి అర్బన్: కండలేరు జలాశయంలో పూడిక తీయించి...తిరుపతికి తాగునీటిని అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఈ నెల 9వ తేదీన టెండర్లు ఆహ్వానించాలని సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్‌తోపాటు ఇరిగేషన్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ నుంచి తిరుపతికి రోజుకు 250 కూసెక్కుల నీటిని నెల రోజుల పాటు అందించాలని చెప్పారు. అనంతరం వర్షాలు వస్తాయని, తిరుపతికి తాగునీటి ఇబ్బందులు ఉండవని వివరించారు. పూడిక తీయించడానికి అయ్యే ఖర్చులను తిరుపతి కార్పొరేషన్ భరించాల్సి ఉంటుందన్నారు. ఇదిలావుండగా కండలేరు జలాశయం సామర్థ్యం 67 టీఎంసీలు ఉండగా.. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల కారణంగా ఆరు టీఎంసీల నీరు మాత్రమే నిల్వఉంది. సమావేశంలో తిరుపతి కార్పొరేషన్ ఎస్ఈ మోహన్‌తోపాటు నెల్లూరు తెలుగుగంగ ప్రాజెక్టు ఎస్ఐ రమణారెడ్డి, నెల్లూరు కండలేరు రిజర్వాయర్ ఈఈ విజయకుమార్‌రెడ్డి, వెంకటగిరి తెలుగుగంగ ప్రాజెక్టు ఈఈ రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

8 నుంచి కొత్త ఇసుక పాలసీ



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: జిల్లాలో ఈనెల 8 నుంచి కొత్త ఇసుక పాలసీ అమల్లోకి రానున్నట్టు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇసుక కొత్త విధానాలపై కలెక్టరేట్‌లో శనివారం అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒక్కో వ్యక్తికి రోజుకు 20 టన్నుల ఇసుక ఇవ్వడానికి కమిటీ అంగీకరించినట్లు చెప్పారు. ఇసుక పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు రాత్రి సమయంలో పోలీస్, రెవెన్యూ ఉద్యోగులకు డ్యూటీలు వేయనున్నట్టు వెల్లడించారు. ఉదయం 6 నుంచి రాత్రి 6 గంటల వరకు ఇసుక రవాణాకు అనుమతివ్వనున్నట్టు పేర్కొన్నారు. మూడు నెలలకు అవసరమైన ఇసుకను స్టాక్ పాయింట్ల వద్ద డంప్ చేయాలన్నారు. ఇప్పటి వరకు ఇసుక పాలసీ కమిటీ జిల్లాలో నాలుగు పాయింట్లను గుర్తించినట్టు వెల్లడించారు. ఒక్కో పాయింట్ వద్ద స్థానిక పరిస్థితులను బట్టి రేట్లు నిర్ణయించారని తెలిపారు. అనంతరం అక్రమ ఇసుక రవాణాకు చెక్ పెట్టడానికి చేపట్టిన పలు అంశాలను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. డీఆర్వో పెంచల కిషోర్, గనులశాఖ విభాగం జిల్లా అధికారి ప్రకాష్ పాల్గొన్నారు.

భయపెడుతున్న ఇసుక రేట్లు

జిల్లాలో ఇసుక రేట్లు భవన నిర్మాణదారుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. గూడూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని వెంకటగిరి మండలం, మొదలగుంట ఇసుక స్టాక్ పాయింట్‌లో మెట్రిక్ టన్ను రూ.590, సూళ్లూరుపేట డివిజన్‌లోని దొరవారిసత్రం మండలం, మావిళ్లపాడు ఇసుక స్టాక్ పాయింట్ వద్ద టన్ను రూ.465, సత్యవేడు నియోజకవర్గం, పిచ్చాటూరు మండలం, ఏకే బీడు ఇసుక స్టాక్ పాయింట్ వద్ద టన్ను రూ.200, శ్రీకాళహస్తి మండలం, సుబ్బానాయుడు కండ్రిగ వద్ద రూ.200గా జిల్లా ఇసుక కమిటీ నిర్ణయించింది.

బంగారు తిరుచ్చిపై శ్రీసీతారాముల అనుగ్రహం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి అనుబంధంగా వెలసిన శ్రీరాముల వారు తిరుచ్చి వాహనం ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. శ్రీరాముల వారి జన్మనక్షత్రమైన పునర్వసు సందర్భంగా బంగారు తిరుచ్చి వాహన సేవ నిర్వహించారు. ఇందులో భాగంగా సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యా లను నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేక సేవను నిర్వహించి వజ్ర వైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ చేపట్టారు. సర్వాలంకర శోభితుడైన స్వామి వారు, శ్రీసీతాలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామివారితో కలసి బంగారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

పరిశుభ్రత లోపిస్తే చర్యలు తప్పవు



వీధుల్లో పర్యటిస్తున్న కమిషనర్ అదితిసింగ్

తిరుపతి తుడా: నగరంలో పారిశుధ్యం లోపిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ అధికారులను హెచ్చరించారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఇంజినీర్లతో కలిసి శనివారం ఉదయం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. పారిశుధ్య లోపం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. 3, 4 డివిజన్లలో పారిశుధ్యం లోపించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వహిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. 45వ డివిజన్ శివజ్యోతినగర్‌లో పర్యటించి ఆమె మెరుగైన పారిశుధ్యం అమలుకు సూచనలు చేశారు. మున్సిపల్ ఇంజినీర్ వెంకటరామిరెడ్డి, డీఈ విజయ్ కుమార్‌రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్లు సుమతి, నాగరాజు, మేస్త్రీ జగన్ పాల్గొన్నారు.